తెల్లారి చూస్తే లోకం అంతా మరో రూపం! ఎక్కిచూచే ఏటిగట్టూలేదు. పడవలు నడాడే కాలవా లేదు. పంటా లేదు. వంటా లేదు. సస్యశాలిని సమస్తం సైకత సాంద్రంగా అయి పోయింది. రాజమార్గం, వస్తూపోతూవుండే రాజమార్గంకు, బండ్ల రాయిడి తప్పి, గండ్లరాయిడి తగిలింది. పెద్ద గండి ఆ చోట పడింది. అక్కడే పడింది. ఆ తల్లీ పిల్లా నడచేచోటనే పడింది. అంధకారాన్ని పడింది. అయోమయంగా పడింది.

అవితే గండిదా మొండి జీవనం, ఆమెదా మొండి జీవనం అన్నట్టు, తల్లి ఈతాలాడుతూ, పిల్ల ఎక్కి అరుస్తూ వున్న చెట్టు మొదటను కౌగలించుకుని కొనప్రాణంతో వుంది!

పిల్ల "అమ్మా!" అంది లోకాన్ని ఆసవాలు పట్టినట్టు. తల్లి "బాగున్నావా? నా తల్లీ!" అంటూ ప్రాణం విడిచింది.

.... .... .... .... ....

## వి జు గు రు వ జో

వీధిగదికి తూర్పువైపునకున్న ద్వారం గుండా ఎదరిళ్ళ తెల్లగోడల్ని, ఇళ్ళ మీది ఆకాశాన్ని, ఆ యిళ్ళకూ మా యింటికీ మధ్యవున్న బహిరంగపు రస్తాను చూస్తూవున్నాను. పట్నవాసపు సందడినంతా వింటూ వున్నాను ఓ సాయంకాలం — ఏడుగంటలవుతుంది. హఠాత్తుగా ఆకాశం ఎఱుపెక్కి వూరుకుంది. ఎదర గులాబి రంగలమినంత శోభాయమానంగా వుంది వెలుగు, గోడల్ని, మేడల్ని—మట్టిరస్తా యావత్తూ కొత్తరక్తిమ గొలిపింది.

వెంటనే అనుకున్నాను—నాటి సూర్యుడు పడమటివైపు గోదావరియొక్క ఆవలి దిఙ్మండలపు టంచునే అమోఘమైన అరుణరాగం విరచిమ్ముతూ క్రుంకుతూ వున్నాడని; నేను నా కుర్చీలోంచి లేచి, తోడ్తోనే గోదావరి గట్టెక్కిపోయాను చేరువ వీధినే చేరుకుంటూ;—నిజంగా ఆ సూర్యాస్తమయ శోభ అత్యంతానందం గలిగించింది నాకు. ఇక నా మెఱుపున కామెఱుపే సాటి అనేలా చూస్తూ నిలబడిపోయాను. నిలబడి పోయి నివ్వెరగా పరికిస్తూవున్నాను. ప్రాణమున్న ప్రతీజీవి ఆ కాంతిపుంజాన్ని చూడకుండా వుండదనుకున్నాను—అల్లి బిల్లిగా అల్లుకుపోయిన తీగల ఎఱ్ఱటి పూతలా, వొళ్లెల్లా కప్పడే టట్టు వోమత్త కాశిని కుసుంభా వన్నెచీర కట్టుకొని, చిక్కపట్టు కున్నా గాలికి అల్లల్లాడే చెంగుల్లా, రింగుల్లా, అదో తెరలా ఎదో పొరలా ఆ విపరీతపు వెఱ్ఱి ఎఱ్ఱటిరంగు వినువీధిని కను బండువు గావించింది. కుండ నిండించి తొణికించే వసంతంలా తోచింది. ఇంతెందుకు ఎంత మంచి గోరింటాకు రుబ్బిన బిబ్బోకవతి హస్తాలకైనా అలాంటి రంగు వస్తుందని నేననుకోను.

కొండను ఉఱుంలేదు. మెఱుంలేదు. మేఘం మాత్రం నల్లనా దండిగా అక్కడక్కడ ఆ అరుణిమ నడుమ దాగివున్న మాట నిజం. కాని నాకు వినబడ్డం లేదు ఏ ఉఱుమూ ఏధ్వనీ, కనబడ్డం లేదు సౌదామిని. నిలుచున్న వాణ్ణి కూర్చున్నాను గట్టుమీద ఆ కనబడే దృష్టి తిరమన్నట్టు!

"అయ్యో రిక్కడే ఆలాగ్గా కూకోండి! నే నిప్పుడే అయిదు నిమిషాల్లో వస్తాను. మీకో తమాషా చూపిస్తాను." అన్నాడు శాయలోడు. వాని పేరు శంభన్న—శంభన్న వంక

చూచాను, వాని చేతులో ఏముందోకాని, నెత్తిమీద మాత్రం చిన్న కుండ వుంది. కుండ మీదో మూకుడుంది. "వీడెదో మధూకరానికి పోతున్నాడు" అని లోలో అనుకొని.— "అప్పుడే మధూకరపు రేత్రి అయిందా? ఇంకా పూర్తిగా పొద్దే క్రిందికి పడిపోలేదు." అని అంతలోనే శంకించి "అయినా వాని కోసమా ఏమిటి ఈ వచ్చింది—అరుణాస్తమానం కోసం గాని" అని అదే తన్మయంగా పడమటి తట్టు కనుగొంటూ వున్నాను. బాగా కనిపించడం ప్రారంభమైన ఓ ఇరువై నిమిషాలకే ఆ ఎఱుపంతా ఎక్కడి దక్కడ తిరోహితమైంది. ఊదేసినట్టు ఉఫ్ అన్నట్టు మఱి కనపడలే. నల్లని మేఘం, రాత్రి క్రమేణా కాపటిచే నల్లని చీకటి, నేనూ మిగిలి పోయినాం.

* * * * *

శాయిల శంభన్నను నేను బాగా ఎరుగుదును, వాడు వీధుల్లో తిరిగే సమయాల్లో. కాని వాడి కంత దగ్గఱలో ఓగుడిసె, ఒక కాపురం, ఒక నిరుకు ఒక నియామకం వుందని ఆక్రితం ఎరుగను. ఆ పొద్దు వాడక్కణ్నే గట్టు క్రింద, గోదావరి తీసి పోయిన తడి ధరణిమీద మొర్రిగా మోటుగా వేసికొన్న ఒక గుడిసెలోంచి యివలకు వచ్చాడు. "ఎక్కడకు వెడుతున్నావు" అని వాణ్ణి ఆ గుడిసెలోంచి యివతకు ఎవళ్ళూ వచ్చి అడగనూ లేదు సాగనంపనూలేదు. కాని వాని పఞతి ఓ పరాకు సెప్పినట్టు ఇప్పుడాంతోవుంది నా చెవుల్లో! ఏలా నిల్చివుందో ఆ అవూను?— ఒరే వుమాంవా? ఆ పాము వఱదప్పట్నుంచి ఈ పక్క పక్కల్నే సంచారం చేస్తూ వుందంట్రా! నిన్న నల్లాబుల్లెమ్మగారి పిడకలగూడు మీదినుంచి కోడిపిల్ల కిందకు దిగేలేదంట దానికి

జడిసి. మొన్నను గామోసు, సందేల స్తానానికొచ్చిన బామ్మ నావిడ కాళ్ళల్లో పడేతలికి ఈ ప్రపంచమంతా పరువుళ్ల తొక్కిం దంట ఆ యిల్లాలు! ఒరేవు! వేరు ముక్కట్టు కెడుతున్నావా? నాగ సొరబ్బుర మెల్నుందా?—అరెరెర్రెరే! వెళ్ళిరా! నామాంవా! ఏ పాము నెత్తిని మణి దొరికెనో? మనకే నాటి కీళని విఱగడయ్యేనో? వెళ్ళిరా: నామాంవా! అరెరెర్రెరే! శివుడున్నాడు మనపాల! ఆ దేవుడి మెడలో కోడెతాచును తలుసుకో! పుట్టలో నాగన్నను తెలుసుకో! పేరంటాల్ని పిలుసుకో! నా సచ్చిపోయిన సయితిని మఱిసిపోకు! సేకుం గారా! నా శంభన్నమాంవా!” అని వాని పణతి పంపినట్టు ఇప్పుడు కాపడుతూవుంది నాయెట్ట యెదర కనుకట్టులావో వీడ్కోలు వైభోగం!—శంభన్న పణతినీ ఎరుగుదును ఆవఱకు వీధుల్లో తిరుగుతూవుండేటప్పుడు. కాని అది వాడి పెళ్ళాం అని గాని దానిది ఆ కాడే యని కనిగాని నాకు తెలియదు.

* * * * *

ఒక వంద గజాల్లో ఆ గట్టమ్మటే ఓ దిక్కున పెద్ద అలజడి అవుతూవున్నట్టు పొడగట్టింది. శంభన్న గొంతు ఆకాడ వినబడుతూ వుంది అప్పుడే: “ రా! నా నాగన్న దేవరా! రా! పాకలోంచి ఱివలకురా! ఆ మూలనుంచి ఇలా రా! ఎదో సాటు సాటుకు పోతున్నావు! తప్పిస్తున్నాను ఇదిగో రోలు తీసేస్తు న్నాను! పుల్లలొత్తిగిస్తూన్నాను! చెత్తతోసేస్తూవున్నాను!” అన్నట్టు వాని ముందు వినవస్తుంది. ఈవలి ప్రజలు చూడవచ్చిన వాళ్ళు ఇవి ఇళ్ళా గుళ్ళా? ఎలా వుంటూవున్నారర్రా ఈ ఇరు కుల్లో—పాములూ వస్తాయి! పిశాచాలూ వస్తాయి—” అని

మసక చూపులు చూస్తూ వున్నారు. శంభన్న గుడిసెలో ఏం చేస్తూవున్నాడో అని కనిపెడుతూ వున్నారు. పాము శంభన్నకు చిక్కిందేమో ?

ఒక్కని చేతిలోను కర్రలేదు కాగడాలేదు. "ఆ పాము మక్కువకొద్దీ సిక్కాలి కాని పొగేస్తే పగ పడద్ది" అంటూవుంది ఓ ముసిల్ది. అసలు నివసించి వుండే వాళ్ళంతా అప్పటికి జామై ఆ కుటీరం ఇవలకు వచ్చి ముక్కోటి వేలుపులకు మొక్కుకొంటూ ఆశలాటిపోయి వున్నారు. "పామన్న పాము కాదల్లో ! పది రోజుల్నుంచి పదిలంగా ఈ పక్క పక్కల్నే పట్టు కూర్చుని ఈ పొద్దు పాకలోకి దూరింది. అదెక్కడి తాచో ! చెయ్యెత్తు లేచి తోకమీద ఆడిపోతే !" అని శంభన్నవంక వేడికోలుగా కనుగోసాగారు.

గుడిసెలో చీకటి గుయ్యారము. శంభన్న వంటి రంగు తారు పూసికొన్నంత తేటు రంగు. తాచు తెల్లతాచైతే కనబడుద్ది గాని నల్లతాచైతే కనబడే దేమిటి ? శంభన్నవి మాత్రం మన నేత్రాల్లాంటి నేత్రాలు గావు ?" అన్నారు కొందఱు. మఱి కొందఱు "అడిదగ్గఱ వేలుముక్క, మన దగ్గఱ లేంది వుంటుంది ! అదక్కడల్లా పెట్టాడా ఆ తాచు నల్లత్రాచవనీ తెల్ల త్రాచవనీ అలా జోలపడిపోయి జోకొట్టినట్లొరిగి పోవాలి !" అంటూవున్నారు.

శంభన్న నాగస్వరం పట్టేడు చీకట్లో. చీకట్నే తరింప జేసే టంతటి గానంగా ఊదేడు బుగ్గలు రవ జేసికొంటూ— ఈవలి వాళ్ళంతా "ఈ పప్పులేం దాని దగ్గఱుడక" వంటున్నారు.

* * * * *

చీకట్లో శంభన్న చీకట్లోనే నిష్క్రమించే దన్నట్టు నాగస్వరం ఊదడం మానేశాడు! "శంభన్నా!" అని బయట వాడొకడు పిలవబోతే "ఊరుకోరా! పామును పట్టినట్టున్నాడు" అని వేఱొకడు మొదటివాని గుక్క నొక్కేశాడు.

శంభన్న ఒక్క కేకేశాడు. "దొరికాడు, నాగన్న దొరికాడు!" అంటూ కుండమీద మూకుడు మూతేశాడు. నాగసౌరపు బుఱ్ఱ మొలకి వ్రేలాడేశాడు. కుండ నెత్తినెట్టుకుంటూ "మీరుండండి! సుఖంగా మీ పాకలో! నే వెడుతూ వున్నాను. నా నాగన్నను తీసుకు వెడుతూ వున్నాను" అన్నాడు.

అందఱికీ ఆశ్చర్యంగానూ వుంది అనుమానంగానూవుంది. "వాడు సూపిందిలేదే పాముని మనకు?" అని వొకడంటే "ఉత్తి ఉత్తి ఆటకే వచ్చాడంటావా ఆడిపని సెరుపుకొని" అన్నాడు మఱొకడు. "సూపెట్టమన్నారా?" అన్నాడు శంభన్న. "బాబో వద్దు! బరిమీదున్నప్పుడు సూసిన భయం ఇంకా వదల్లేదు మాకు—బాబూ! వద్దు! వద్దు! వద్దు!" అని ఆ చుట్టు పక్కల వాళ్లు అంటూవుంటే, కొందఱు కొందఱు పలాయనులైనారు. "ఒకళ్ళ దగ్గిఱా బుడ్డి దీపమన్నాలేదు. అగ్గిపెట్టన్నా లేదు. ఏమిటి సూత్తాం ఆడు సూపితే మాత్రం" అని వొకడన్నాడు. "ఆలాకాదు. కొన్ని కొన్ని గొప్ప గొప్ప కోడెతాచుల నెత్తిమీద మణి వుంటుంది. ఆ వెలుగే శాన దాన్ని కాపఱచడానికి. ఏం! శంభన్నా! నీవు పట్టిన తాచుకు నెత్తిమీద మణి వుందేమో కనిపెట్టావంట్రా. మూకుడు కప్పావు: మాకేం ఆనడంలేదు" అని అడిగాడు మఱొకడు తెగించి. శంభన్న "దింపి సూపమంటారా? భయపడరుగదా! ఇంకా గరళం

పిండని పాము. సూపేదా ?" అంటూ నెత్తిమీద కుండ దించి మూకుడెత్తాడు !—అక్కడ వొక్కడు నిలబడితే వొట్టు. మాఅు మనిషంటూ వుంటేగా మణి కాంతి కనుగోడానికి ?

కుండలో ఏదో మినుకు మినుకు కాంతి వుంది. ఏదో నల్లగానూ మెదుల్తూవుంది. ఆపాళంగా శంభన్న నా కాడకు వస్తూ పామును మెళ్లో వేసుకు గుప్పిట్లో ఏదో మెఱయిస్తూ "బాబూ! ఏం కానుక యిస్తారు నే పడ్డ కష్టానికి ?" అన్నాడు. "నీ చేతిలో మణి పెట్టుకుని నన్ను ముష్టెత్తుతా వేంటిరా ?" అన్నాను. "చెయ్యట్టుండి. భయ్యం గియ్యం లేదు" అన్నాడు. తన గుప్పిట్లో కాంతిల్లే దానిని నా చేతిలోకి వదిలాడు. అది మిణుగురు పురుగు.

నిర్ఘాంతపోయాను. "ఇదా నీ కుండలోని కాంతి ?" అని అడిగాను. "మతేంటనుకున్నారు" అని అంటూ పెళ్ళాన్ని పిలిచి "దాని నోటి గరళం పిండు. సోలడొచ్చేటట్టుంది" అన్నాడు. పెళ్ళాం ఆ పామును అలా పట్టుకొని చూస్తూ "ఇదేరా! నా సచ్చిన సయితి అవతార మెత్తుతానన్న అవతారం ఇదేరా ?" అంటూ ఓ గళాసులోకి పిండింది కోరలంట గరళం మిలమిలా బిలబిలా జారిపడేలా! ఆడి బిడ్డలంతలో పిలపిలామంటూ యివలకు వచ్చేరు. శంభన్న "ఇదిగో వేరుముక్క ! మీముంగట గిరాటేస్తూన్నాను. ఎవడు ముందు తెచ్చుకుంటే ఆడిదీ ఈపాము" అంటూ ఏదో నల్లని, చీకట్లోకి విసిరేడు ఓ వేరు. హొలోమంటా ఆడి పిల్లా జల్లా అల్లరి బిల్లరిగా దానికై వెతుకులాడుకుంటూ దూరమైనారు.

నా గుప్పిట్లో వాడుంచిన మిణుగురు పురుగును నేలమీదకు నేను జారవిడుస్తూ "ఇప్పుడెళ్ళి పట్టిన పామేరా ? అది ?" అని

అడిగాను. శంభన్న "బాబూ! తమరూ నన్ను అనుమానిస్తేనే బతికేదెల్లా? మొదటి పెళ్ళాం లెగిసిపోయింది. ఎప్పుడన్నా కోడి రూపంగా కాపడద్దినాకు. గుడిసెక్కి కూస్తూవుంటుంది తెల్లాఱగట్ల. రెండో పెళ్ళాం చచ్చి యీ పాము అవతారం ఎత్తి ఇల్లా పట్టుపడతా వుంటుంది! నా చేతికే చిక్కద్ది. మతొకరిక్కాపడదు. చేపడదు. మూడో పెళ్ళాం ఇప్పుడిలా వచ్చి అలా గుడిసెలోకి తిప్పుకుంటూ వెళ్ళిందే అది! దానిదీ నాదీ మనిషి రూపాలే "ఆ పిల్లలంతా నావోళ్ళు! బాబులు దయ!" అన్నాడు.

"నేటి సందె లిడత ఎరుపునంతా దిగమింగిన చీకటి దయ" అన్నాను.

.... .... .... .... ....

## ఎఱుపు రంగు

మందరాసు "మెరీనా" ప్రపంచంలోని సముద్ర తీరము లన్నింటిలోను ఉత్తమోత్తమమైనదని సర్వులు అంగీకరించిన విషయమే! మరిన్నీ వర్షము కురిసి వెలిసిన తక్షణం ఆ తీరమందలి ఇసుక మీద నడుస్తురా జనం, వారి వారి అరికాళ్ళ పాద రేఖలనుండి "హైహీల్సు" దాకా విస్పష్టం కాగలవు. నాటిసాయంకాలం ఒక గంట ఝంఝూమారుతానికి సముద్రం ఉబ్బుబ్బిగి పోయింది. సముద్ర కెరటాలయొక్క నురువు తెల్లటి వింజామరల అల్లాటలా ఎగిరెగిరి పడేది. దిఙ్మండలాన్నే ఒక్కొక్క నల్లని మేఘం పైకి నీటినుండి ఆవిర్భవించినట్టు కనబడుతూ, వానకాళ్ళ